

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 23 నవంబరు 2024 | 5





గాలి పీల్చినా.. ప్రమాదకరమే..


ప్రాంతం	ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
రాజమహేంద్రవరం (పేపర్‌మిల్లు)	115
రాజమహేంద్రవరం (ఏవీరోడ్డు)	107
రాజమహేంద్రవరం (లాలాచెరువు)	87
కాకినాడ (రమణయ్యపేట)	101
కాకినాడ (లైట్‌హౌస్)	102
కాకినాడ (సాలిపేట)	108



వీఆర్‌కు రామచంద్రపురం సీఐ

- ఓ సామాజికవర్గ వన సమారాధనకు యూనిఫాంతో హాజరు
- కులానికి మద్దతుగా వ్యాఖ్యలు
- ఉన్నతాధికారుల సీరియస్
- వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు

6లో



తెలవారదేమీ స్వామీ: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట అలమూరు రోడ్డులో శుక్రవారం ఉదయం 8 గంటలకు మంచుదుప్పటి..



గజ..గజ
పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత
- వణికిస్తున్న వాతావరణం
- కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు
- 14 డిగ్రీలకు పడిపోయిన వైనం
- సాయంత్రం మొదలు.. రాత్రి తీవ్రం
- మంచుతో అర్ధరాత్రి ఇబ్బందులు
- వ్యాధులతో జనం సతమతం
- జాగ్రత్తలు పాటించాల్సిందే

14..15..16.. 19..20.. మన దగ్గరా ఈ ఉష్ణోగ్రతలు.. అవును చూస్తే ఆశ్చర్యంగా ఉంది కదూ.. ఈ ఏడాది చలి తీవ్రత అంతలా పెరిగింది మరి. చిన్న, పెద్ద తేడా లేదు అంతా చలికి గజగజ వణికిపోతున్నారు. మళ్లీ ఆ పాత రోజులు గుర్తు చేసుకుంటున్నారు.. చాలా ప్రాంతాల్లో చలిమంట వేసుకుని కాగుతున్నారు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. వాతావరణ మార్పుల కారణంగా సూర్యోదయం ఆలస్యం కావడంతో రోజు ప్రారంభం ఆలస్యమవు తోంది. సాయంత్రం సూర్యాస్తమయం త్వరగా అయి పోతుండడంతో 5 గంటలకే చీకటి పడిపోతోంది. సాయంత్రం నుంచే చలి ఆరంభం కావడంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అర్ధరాత్రి నుంచే ఎక్కడికక్కడ మంచు అలుము కుంటోంది. ఉదయం సూర్యోదయమైనా మంచు దుప్పటి కప్పేసి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత, వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో జనం ఇదేం ఛీ..జన్ అంటూ నిట్టూర్చుతున్నారు.




(పిఠాపురం - ఆంధ్రజ్యోతి)

శీతాకాలం ప్రారంభమైన తొలి నెలలోనే చలి పులి పంజా విసురుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి జిల్లాల్లో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చలిగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు చలికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రి 11 గంటల వరకూ రద్దీగా ఉండే రహదారులు 8 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం ఎండ వచ్చే వరకూ ప్రజలు రోడ్లపైకి రావడం లేదు. చలితో పాటు పొగమంచు ప్రభావం అధికంగా ఉంది. వాతావరణ మార్పులతో జ్వరాలు, దగ్గు, జలుబు తదితర రోగాలతో బాధపడుతున్న వారి సంఖ్య అధికమవుతోంది.

కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు

శీతాకాలంలో సాధారణంగా డిసెంబరునెలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అప్పుడే చలితీవ్రత గణనీయంగా పెరుగుతుంది. జనవరి నెలలోనూ అధికంగా ఉంటుంది. ఈసారి అందుకు భిన్నంగా నవంబరు మూడో వారం నుంచి చలితీవ్రత పెరిగింది. రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రత 14-20 డిగ్రీలుగా నమోదవుతుండగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు మాత్రం 29-31 డిగ్రీలు దాటడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, మోతుగూడెం తదితర ప్రాంతాల్లో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల తదితర ప్రాంతాల్లోను 15, 16 డిగ్రీల కనిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవన్నీ ఏజెన్సీలో అటవీ ప్రాంతంలో ఉండడంతో సహజంగానే ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. కానీ తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో 16 డిగ్రీలు, దివాన్‌చెరువులో 18 డిగ్రీలు, గోపాలపురంలో 17 డిగ్రీలు నమోదవుతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. కొవ్వూరులో 18 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కాకినాడ జిల్లా తుని, అన్నవరంలలో 18 డిగ్రీలు, కోనసీమ జిల్లా రావులపాలెం, యానాంలో 19 డిగ్రీల కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నగరాల్లోను ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోయాయి. ఉదయం 10 గంటల వరకూ చలి తీవ్రత కొనసాగుతుండగా సాయంత్రం 4 గంటలకు చలిగాలులు వీయడం ఆరంభమవుతోంది. దీంతో రోజువారీ ఉదయమే విధులకు హాజరయ్యే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. చలి తీవ్రతతోపాటు పొగమంచు ప్రభావం గణనీయంగా పెరిగింది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ పొగమంచు తగ్గడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిస్తే ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే ప్రమాదం ఉంది. మంచు కారణంగా అర్ధరాత్రి హైవే మూసుకుపోతోంది.



పెరిగిపోయిన ఏక్యూఐ

తీవ్రమైన చలి, మంచు కారణంగా ఉమ్మడి జిల్లాలోని ప్రధాన నగరాలైన కాకినాడ, రాజవ ుహేంద్రవరంల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పెరిగిపోయింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) అంటే గాలిలో ఉండే నాణ్యత.. దీని రీడింగ్‌ను కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తీస్తుంటారు. ఇది 1-50 మధ్య ఉంటే గాలి నాణ్యత సురక్షితంగా ఉన్నట్టు లెక్క. ఇది 50-100 మధ్య ఉంటే సంతృప్తికరంగా మాత్రమే ఉన్నట్టు. కానీ 100-200 మధ్యలో ఉంటే మోడరేట్ (ఆందోళనకరస్థాయి)లో ఉన్నట్టు పరిగణిస్తారు.కాకినాడలోని సాలి పేటలో ఏక్యూఐ స్థాయి అత్యధికంగా 108 వరకు ఉంది. రాజమహేంద్ర వరం లోని పేపరుమిల్లు వద్ద 115 వరకు ఉంది. ఈ గణాంకాలు ఆయా నగరాల్లో ఆందోళనకరంగా ఉన్నాయి. నగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండడమే వీటి పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.



ఉన్ని దుస్తులకు డిమాండ్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్వెటర్లు, మంకీ క్యాప్‌ల అమ్మకాలు జోరందుకున్నాయి. ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్,పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచే కాకుండా నేపాల్ నుంచి వచ్చిన వ్యాపారులు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం తదితర నగరాల్లో రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. చిన్నపిల్లలకు స్వెటర్లు రూ.200 నుంచి రూ.300 మధ్య, పెద్దవారికి రూ.300 నుంచి రూ.400 లభ్యమవుతున్నాయి.రగ్గుల ధరలు రూ.350 నుంచి రూ.600 వరకు ఉన్నాయి. మంకీ క్యాప్‌లు రూ.50 నుంచి రూ.100 మధ్య దొరుకుతున్నాయి.

ప్రమాదకరం.. డాక్టర్ సూర్యకుమారి, పల్మనాలజీ, జీజీహెచ్ కాకినాడ



చలికాలం ప్రమాదకారి.. అనారోగ్య రుగ్మతలకు గురయ్యే అవకాశం ఉంది. ఆస్తమా రోగులు.. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్నవారికి న్యూమోనియా ఎక్కువగా వస్తుంది. చలికాలంలో పొగమంచుతో సమస్య ఉంటుంది. ముందుగా జలుబు, దగ్గు, తర్వాత జ్వరం వంటి లక్షణాలుంటాయి. వాయు, జల కాలుష్యం ఉంటే సులువుగా ఈ వ్యాధులు సోకుతాయి. అప్రమత్తతోనే చలికాలంలో పలు రకాల అనారోగ్య రుగ్మతల నుంచి ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

పెరుగుతున్న జ్వరాలు

చలితీవ్రత, వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలతోపాటు దగ్గు, రొంప, గొంతునొప్పి, వంటి నొప్పులు వంటి లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చలిలో తిరిగేవారు కళ్లమంటలతో ఒంటిపై దురద, ఎలర్జీ వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. ముఖానికి రక్షణ లేకుండా బయట తిరిగే వారిలో ఇది అధికంగా కనిపిస్తోంది. కొందరికి కళ్ల వెంబడి నీరు కారుతుండడం, కళ్లు దురద తీవ్రంగా ఉండడం తదితర లక్షణాలు కనిపిస్తున్నాయి. చిన్నారుల్లో జ్వరం, రొంప, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు చిన్నారులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఉష్ణోగ్రతలు ఇలా..

ప్రాంతం	కనిష్ఠం	గరిష్ఠం
చింతూరు	14	31
మోతుగూడెం	14	31
రంపచోడవరం	15	29
మారేడుమిల్లి	15	29
రాజవొమ్మంగి	16	31
గోకవరం	16	31
అడ్డతీగల	16	31
గోపాలపురం	17	31
కొవ్వూరు	18	29
రాజమహేంద్రవరం	18	28
దివాన్‌చెరువు	18	32
అన్నవరం	18	31
తుని	18	31
కాకినాడ	19	31
జగ్గంపేట	19	31
మండపేట	19	32
యానాం	19	31
రావులపాలెం	19	32
సామర్లకోట	19	31
పిఠాపురం	19	31
రాజోలు	20	31
అమలాపురం	20	31

జిల్లాలో 2.37 లక్షల మెట్రిక్ టన్నుల

ధాన్యం కొనుగోళ్లు లక్ష్యం

రైతుల కోసం రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ రద్దు : జేసీ నిషాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా నిర్దేశించామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ప్రతిబంధకంగా మారిన రైస్‌మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. రైతులు సమీపంలోని తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించి విక్రయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో సమస్యలను అడిగి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను మిల్లర్లకు వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాహనం ట్రక్ సీటు జనరేట్ అయి ఆరు గంటలోపు మిల్లులకు చేరాలని ఆదేశించారు. దళారులు, మధ్యవర్తులకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరలకు విక్రయించుకోవాలన్నారు. రైతు పండించిన ధాన్యం తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలు ఎఫ్ఏక్యూ విశ్లేషించడం జరుగుతుందన్నారు. రైస్ మిల్లర్లు తమ మిల్లులకు చేరిన వాహనాలు నిరీక్షణకు తావు లేకుండా రెండు షిఫ్టులలో పనిచేసేలా హమాలీలను నియమించుకోవాలన్నారు. ప్రతీ మిల్లుతో పాటు రైతు సేవా కేంద్రాలను తరచుగా సందర్శిస్తామన్నారు. రైతులకు మిల్లర్లు ధాన్యం కొనుగోలులో పూర్తిగా సహాయ సహకారాలు అందించాలన్నారు. నాన్ ట్రేగింగ్ రైస్ మిల్లులకు ధాన్యం సేకరణలో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం ఎగుమతి చేసిన దగ్గర నుంచి రైసుమిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జీపీఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ చేయనున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రం ద్వారా కాకుండా ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మదలచిన రైతులు సదరు వివరాలను రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం విక్రయంలో రైతులు, మిల్లర్లతో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా కేంద్ర కార్యాలయ కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబరు 1967 లేదా సెల్ 9441692275, 8309432487లను సంప్రదించవచ్చునని జేసీ నిషాంతి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మరో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు ఏర్పాట్లు

28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ



పిచ్‌ను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అంతర్‌జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీలకు అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 28నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. క్రీడా పోటీలకు సిద్ధం చేస్తున్న క్రికెట్ పిచ్‌లను జిల్లావిద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా శుక్రవారం పరిశీలించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.గోవింద్, ఫిజికల్ డైరెక్టర్ తోట రవికి డీఈవో పలు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ కోచ్, రాయుడు సతీష్ ఆధ్వర్యంలో పిచ్ తయారు చేస్తున్నారు. అండర్-14 క్రికెట్ పోటీలను విజయవంతం చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని డీఈవో వ్యాయామ ఉపాధ్యాయులకు తెలిపారు. ఉమ్మడి జిల్లాల స్థాయిలో 13 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అడబాల విజయ్‌శ్రీనివాస్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ కార్యదర్శి బీవీవీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి గణపతి రామారావు, అమలాపురం జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కామన గణేశ్వరరావు, హెడ్‌క్వార్టర్ కార్యదర్శి ఈశ్వరరావు, ఉండ్రు ముసలయ్య, ముత్యాల కిశోర్, కామన మధుసూదనరావు, కట్టా సతీష్, పి.విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన వేగుళ్ల



సీఎం చంద్రబాబును కలిసిన వేగుళ్ల తదితరులు

మండపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంచనాల కమిటీ సభ్యులు ఏలూరి సాంబశివరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన వెంట ఉన్నారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు వేగుళ్ల చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. పార్టీకి రుణపడి ఉంటానన్నారు. ముమ్మిడివరం, కొత్తపేట, కాకినాడ సిటీ శాసనసభ్యులు దాట సుబ్బరాజు(బుచ్చిబాబు), బండారు సత్యానందరావు, వనమాడి కొండబాబు తదితరులు వేగుళ్ల వెంట ఉన్నారు.

శాసనసభలో వేగుళ్లకు అభినందనలు

రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే వేగుళ్లను అసెంబ్లీలో పలువురు శాసనసభ్యులు అభినందించారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు తదితరులు వేగుళ్లకు అభినందనలు తెలిపారు.



'పవర్' హౌస్
ఇక మీ ఇల్లే విద్యుత్ ఉత్పత్తి కేంద్రం
6లో

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను గుర్తించేందుకు

4న అచీవ్‌మెంట్ సర్వే

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను గుర్తించేందుకు చేపట్టిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. డిసెంబరు 4వ తేదీన పబ్లిక్ పరీక్షలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాస్ సర్వే నిర్వహించేందుకు నియమించిన విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను ఉద్దేశించి డీఈవో సలీంబాషా మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకునే వీలవుతుందన్నారు. డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ నాస్ సర్వేలో భాగంగా జిల్లాలో 104 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఆయా పాఠశాలల నుంచి 3, 6, 9 తరగతులను విద్యార్థులకు నాస్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. అధికారులు విద్యార్థులను సమన్వయం చేసుకని నాస్ పరీక్షను విజయవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు సురేష్, జాన్‌బాబులు ఫీల్డు ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు పోటీలు..

నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంకాపల్లి జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగ విశిష్టత అనే అంశంపై 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంలు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విజేతల వివరాలు..

భారత రాజ్యాంగం విశిష్టత అనే అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జె.కీర్తిశివదేవి విజేతగా నిలిచారు. క్విజ్ పోటీల్లో కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు జి.కుమార్‌చంద్ర, పి.వేదశ్రీ, వక్తృత్వ పోటీల్లో మండపేట ఎస్వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.దయాసాగర్ విజేతలుగా నిలిచారు. డిబేట్‌లో కొంకాపల్లి హైస్కూల్ విద్యార్థి జి.సాయిశ్రీ, పాటల పోటీలో మండపేట విద్యార్థి ఎం.దయాసాగర్, రన్ ఫర్ కానిస్టిట్యూషన్ పోటీల్లో మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ అమలాపురం విద్యార్థి ఆర్.నిషాంత్ విజేతలుగా నిలిచినట్టు ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. వీరంతా జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ పోటీలను సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు, డి.రమేష్‌బాబు, ఎంవీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం కాశి గణసత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి సంబంధించి అసెంబ్లీలో శుక్రవారం ఎన్నికల ప్రక్రియ జరిగింది. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సభ్యుడిగా ఎన్నికైనట్లు స్పీకర్ సీహెచ్ అయన్నపాత్రుడు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల సభ్యునిగా కూటమి ప్రభుత్వం అందించిన అదనపు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి సంస్థల అభివృద్ధికి పనిచేస్తానని చెప్పారు. అదే విధంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు గిడ్డి సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.



సీఎం చంద్రబాబును కలిసిన గిడ్డి సత్యనారాయణ

డీఎస్పీ విజయసారథి బదిలీ

అమలాపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న పి.విజయసారథిని బాపట్ల జిల్లాకు బదిలీచేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఏఆర్ డీఎస్పీ జీయూకేఎల్‌పీ సుబ్బరాజును నియమించారు. త్వరలోనే ఈయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

అక్విడెక్టుపై కారు బోల్తా

ప్రయాణికులు సురక్షితం



పి.గన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్టుపై అదుపుతప్పి ప్రమాదవశాత్తు కారు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురులో ఒకరికి గాయాలు కాగా మిగిలిన ఐదుగురు క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.....నర్సాపురం నుంచి రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి ఆరుగురు వ్యక్తులు కారులో బయలుదేరారు. మార్గం మధ్యలో పి.గన్నవరం అక్విడెక్టు వద్దకు వచ్చేసరికి వేగంగా ముందు వెళ్తున్న కారు డ్రైవర్ గోతులు కారణంగా సడన్ బ్రేక్ వేశారు. దీంతో ఆ కారును తప్పించే క్రమంలో వెనుక కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మన్యం అయోధ్య..
తడికవాగు

నిత్యం రామనామ స్మరణే.. ఆ ఊరంతా కాషాయ వస్త్రధారులే

మద్యం సేవించరు.. మాంసం ముట్టరు


తడికవాగులో వరి పొలాలు







తడికవాగు గ్రామం.. రామాలయంలో పూజ.. గ్రామస్తులు

తడికవాగు.. మన్యం అయోధ్యగా పిలవబడే చిన్న గిరిజన గ్రామం. ఆ ఊరంతా రామభక్తులే. వారిలో ఏ ఒక్కరు మద్యం సేవించరు. మాంసం ముట్టరు. వేకువనే రామనామస్మరణతో ప్రారంభమై తిరిగి రాత్రి రామజపంతోనే దినచర్య ముగుస్తుంది. అంతేకాదు ఏడాది పొడవునా కాషాయ వస్త్రాలనే ధరిస్తుంటారు. నిత్యం ప్రవహించే తడికవాగు పక్కనే ఆ గ్రామం ఉండడంతో తడికవాగుగా ఆ గ్రామాన్ని పిలుస్తుంటారు. మండల కేంద్రమైన చింతూరుకు 37 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. వ్యవసాయమే జీవనోపాధి. మొత్తంగా 13 కుటుంబాలే అక్కడ ఉన్నాయి. వారిది ఓ గిరిజన తెగ. కొన్నేళ్ల కిందటే గ్రామస్తులంతా చిన్న రామమందిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వేకువనే స్నానమాచరించి రామమందిరం వద్దకు చేరుకొని పూజలు జరుపుకోవడం ఆనవాయితీ. ఆ తర్వాత భోజనం చేసి వ్యవసాయ పనులకు ఉపక్రమిస్తారు. పొద్దుపోయాక వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి స్నానమాచరించి మరోమారు రామమందిరం వద్దకు చేరుకొని పూజా కార్యక్రమాలు చేపడతారు. తడికవాగులో ఏ ఒక్కరూ కూడా మాంసం ముట్టరు. మద్యం సేవించరు. నిత్యరామనామ స్మరణలో ఉండడమే అందుకు కారణమంటారు వారు. తామంతా హిందువులే కావడంతో రామనామస్మరణ తప్ప మరో వ్యాపకం తమ దరి చేరదంటారు.

● భద్రాద్రికి పాదయాత్ర

ఏడాదిలో ఒక పర్యాయం తెలంగాణలోని భద్రాచలంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి తడికవాగు వాసులు అందరూ పాదయాత్రతో వెళతారు. దాదాపు 107 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తుంటారు.

● సహకారంతో రామమందిరం

డొంకరాయి, పొల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లు, ఉద్యోగుల సహకారంతో తడికవాగులో ఓ మోస్తరు రామమందిరాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్టు 'ఆంధ్రజ్యోతి'కి తడికవాగు గ్రామస్తులు తెలిపారు. వీరంతా వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. కాగా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో తామంతా చీకటిలోనే మగ్గుతున్నామని, రామమందిర పూజారి బాలరాజు వాపోతున్నాడు. విద్యుత్ సరఫరా కల్పించగలిగితే రామ మందిరంలో వెలుగులు నిండేవని, అదే దశలో నిత్యం రామనామస్మరణ మైకు ద్వారా తమ గ్రామమంతా విన్పించేలా ఏర్పాటుచేసుకొనేవారమని బాలరాజు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని బాలరాజు కోరుతున్నాడు.

- ఆంధ్రజ్యోతి/చింతూరు





'పవర్' హౌస్

ఇక మీ ఇల్లే ఓ విద్యుదుత్పత్తి కేంద్రం

» కేంద్ర ప్రభుత్వం రాయితీతో సౌర విద్యుత్ సులభతరం

» ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

» గృహ వినియోగదారులకు మాత్రమే వర్తింపు

(ఆంధ్రజ్యోతి-రాయవరం)

సహజ వనరులను రక్షించుకునేందుకు, ప్రకృతిని సంరక్షించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో నీరు, బొగ్గు ఆధారిత విద్యుత్‌కు బదులుగా సౌర విద్యుత్ వెలుగులు గ్రామాల్లో నింపాలనే ఉద్దేశం ఒకటి. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు తీసుకువచ్చిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ వినియోగదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించనుంది. ఈ పథకంలో నమోదు కావడం ద్వారా ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవడం ద్వారా వినియోగదారుడు తమకు కావాల్సిన కరెంట్‌ను వాడుకుని మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి అందించవచ్చు. వినియోగదారుడే ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం పీఎం సూర్యఘర్ యోజన ద్వారా మారే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని గృహోపయోగానికి వర్తింపజేస్తున్నారు. ఇళ్ల అవసరాలకు ఈ పథకం కింద లబ్ధి పొంది నెలవారీ విద్యుత్ బిల్లుల భారం వినియోగదారులకు తగ్గుతుంది.

విద్యుదుత్పత్తి ఇలా..

ఒక కిలో వాట్ సామర్థ్యంగల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుదుత్పత్తి అవుతుంది. విద్యుత్ వినియోగదారుడికి ప్రస్తుత వినియోగదారుడికి వస్తున్న బిల్లు రూ.1000 అయితే సోలార్ ఏర్పాటు తర్వాత వచ్చే బిల్లు 338 మాత్రమే. ఏడాదికి రూ.8వేల ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటిపై కప్పుపై కనీసం 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో 1కేవీపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. దీనిద్వారా నెలకు రూ.2 వేల విద్యుత్ బిల్లు వచ్చే వినియోగదారుడికి నెలకి రూ.333 బిల్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఏడాదికి రూ.20 వేలు వినియోగదారుడికి ఆదా అవుతుంది. 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకి 360 యూనిట్లు ఉత్పత్తి జరుగుతుంది. నెలకి రూ.3వేల బిల్లు వస్తున్న వినియోగదారుడికి ఆ బిల్లు నెలకి రూ.293కు తగ్గనుంది. దీని ద్వారా వినియోగదారుడికి రూ.32,400 ఏడాదికి ఆదా. ఈ పథకంలో లబ్ధిదారుడికి కేంద్రం నుంచి 1కిలో వాట్‌కు రూ.30వేలు, 2కిలో వాట్లకు రూ. 60వేలు, 3కిలోవాట్లకు రూ.78వేల రాయితీ లభిస్తుంది.

నమోదు ఇలా..

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో నమోదు చేసుకునేందుకు పీఎం సూర్య ఘర్ యోజన యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో వెండర్ల (కాంటాక్టర్లు) వివరాలు ఉంటాయి. పేరు నమోదు చేసుకున్న వ్యక్తులు తమకు నచ్చిన వారిని ఎంచుకోవచ్చు. తన ఇంటికి ఎన్ని కిలోవాట్ల మేర విద్యుత్ అవసరమో ఎంచుకుని నమోదు చేసుకోవాలి. ఒకటి, రెండు, మూడు కిలోవాట్ల వరకు వర్తింపజేస్తారు.

మిగులు విద్యుత్‌కు నగదు చెల్లింపు


ఇళ్లపై బిగించిన సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతుంది. అక్కడి నుంచి తిరిగి ఇళ్ల సర్వీస్ తీగల నుంచి ఇంటి అవసరాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్ సరఫరా, వినియోగం ఎంతమేర అనేది సోలార్ యూనిట్ ద్వారా అమర్చిన ప్రత్యేక మీటర్‌లో నమోదవుతుంది. సౌర ఫలకల ద్వారా ఒక ఇంటి నుంచి ఎంతమేర విద్యుదుత్పత్తి అయ్యింది, ఎంతమేర వినియోగించారు, మిగులు విద్యుత్ ఎంత అనే లెక్కలు మీటర్‌లో నమోదవుతాయి. వినియోగదారుడు సౌరవిద్యుత్ ఉత్పత్తి కంటే అధికంగా వినియోగిస్తే వినియోగదారుడు వాడిన యూనిట్లకు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారుడికి విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలకు ఒకసారి లెక్కించి యూనిట్‌కు మార్కెట్ ధర ప్రస్తుతం రూ.2.90 వంతున చెల్లిస్తారు.

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు



ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారుడు విద్యుదుత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుంది. అధిక ప్రయోజనాలు కలిగిన సూర్యఘర్ యోజనాను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తమకు నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలి. - ఎస్.రాజబాబు, విద్యుత్‌శాఖ కోనసీమ జిల్లా ఎస్ఈ





ఉత్తమ వాయిస్ ఆర్టిస్ట్ అవార్డును అందుకున్న రాధాకృష్ణ.. (పక్కన) నెట్‌ఫ్లిక్స్ సీఈవో మహిమాతో..

ఉత్తమ వాయిస్ ఆర్టిస్ట్ అవార్డుకు కోనసీమ కుర్రోడు

జాతీయ స్థాయిలో తెలుగు విభాగంలో ఎంపికైన యువకుడు

గోవాలో అవార్డు అందించిన నెట్‌ఫ్లిక్స్, ఎన్ఎఫ్‌డీసీ

పి.గన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎఫ్‌డీసీ), నెట్‌ఫ్లిక్స్ సంయుక్త నిర్వహించిన ఉత్తమ వాయిస్ అవార్డుల ఎంపికలో తెలుగుభాష నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం గ్రామానికి చెందిన అడ్డగళ్ల రాధాకృష్ణ ఎంపికయ్యారు. ఇటీవలే నెట్‌ఫ్లిక్స్, ఎన్ఎఫ్‌డీసీ సంయుక్తంగా ఈనెల 21న గోవాలో నిర్వహించిన ఐఎఫ్ఎఫ్ఐ (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేదికపై ఉత్తమ వాయిస్ అవార్డును ఈయన అందుకున్నారు. ఎనిమిది భాషలకు సంబంధించి వాయిస్ ఓవర్ కళాకారుల కోసం నెట్‌ఫ్లిక్స్ ఎన్ఎఫ్‌డీసీ సంయుక్తంగా నిర్వహించిన ఎంపికల్లో దేశవ్యాప్తంగా కొన్ని వందలమంది పాల్గొనగా రెండు నెలలపాటు పరిశీలన చేసి ఇటీవలే 210 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి ఒకేరోజు దేశంలో ఏడు ప్రధాన నగరాల్లో ఎంపికలు నిర్వహించి ఎనిమిది మందిని ఉత్తమ వాయిస్ ఆర్టిస్టుల అవార్డులకు ఎంపికచేశారు. తెలుగుకు సంబంధించి అడ్డగళ్ల రాధాకృష్ణ (ఆంధ్రప్రదేశ్) ఎంపికయ్యారు. గోవాలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతుల్‌కుమార్, నెట్‌ఫ్లిక్స్ సీఈవో మహిమాలతో పాటు పలువురు ప్రతినిధులు రాధాకృష్ణను ఘనంగా సన్మానించి ఉత్తమ వాయిస్ అవార్డుతో పాటు సర్టిఫికెట్‌ను అందించారు. రాధాకృష్ణ గత కొన్నేళ్లుగా పలు తెలుగు టీవీ న్యూస్ ఛానళ్లలో పనిచేశారు. ప్రస్తుతం డిజిటల్ ఛానల్స్ ద్వారా రాజకీయ, సామాజికపరమైన డిబేట్‌లు నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ అవార్డుకు ఎంపికకావడంతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఆజాదీకి అమృత్ కహానియా వంటి ప్రాజెక్టుల్లో పనిచేసే అవకాశం కూడా లభించింది. దీంతో రాధాకృష్ణకు గ్రామస్తులతోపాటు పలువురు నేతలు అభినందనలు తెలిపారు.





మిస్టర్ పాండిచ్చేరి షోలో పాల్గొన్న యువ డాక్టర్ రఘుచంద్ర

మిస్టర్ పాండిచ్చేరిగా యానాం యువ డాక్టర్

యానాం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి చెందిన రోటరీక్లబ్, పుదుచ్చేరి ఫ్యాషన్ మోడల్స్ టాలెంట్ సంయుక్త నిర్వహణలో మిస్టర్, మిస్, కిడ్స్ పాండిచ్చేరి-2024 పేరుతో నిర్వహించిన షోలో యానాం ప్రాంతానికి చెందిన యువడాక్టర్ విజేతగా నిలిచారు. ఇటీవల పాండిచ్చేరి రాక్‌బీచ్‌లో ఈ షో నిర్వహించారు. మూడు విభాగాల్లో జరిగిన షోలో యానాంకు చెందిన సీనియర్ పాత్రికేయుడు కేతా శివశేషుబాబు (ఫణీ), జగదాంబ దంపతుల ప్రథమ కుమారుడు డాక్టర్ కేతా రఘుచంద్ర పాల్గొని విజేత (ప్రథమస్థానం)గా నిలిచాడు. ప్రస్తుతం రఘుచంద్ర పుదుచ్చేరిలోని శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలలో ఎండీ జనరల్ మెడిసన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రథమస్థానంలో నిలిచిన డాక్టర్ రఘుచంద్రకు మిస్టర్ పాండిచ్చేరి బ్యాడ్జ్‌తో జ్ఞాపికను అందజేశారు.

కాకినాడ జిల్లాలో ఇసుక స్టాక్ యార్డుల టెండర్లు ఖరారు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుకస్టాక్ యార్డుల నిర్వహణకు టెండర్లు లాటరీ ద్వారాతీసి విజేతను ప్రకటించే ప్రక్రియ శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగింది. కాకినాడ జేసీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో లాటరీ తీసి టెండర్లను ఖరారు చేశారు. కాకినాడ రూరల్‌లో ఇసుక స్టాక్ యార్డు నిర్వహణకు ఆరుగురు టెండర్లు వేయగా మిథుల కనస్ట్రక్షన్ సంస్థ టెండర్ ఖరారైంది. గొల్లప్రోలులో యార్డు నిర్వహణకు 8టెండర్లు దాఖలుకాగా శ్రీదేవి కనస్ట్రక్షన్ ఎంపికైంది. పెద్దాపురం ఇసుక స్టాక్ యార్డు లాటరీలో ఎంపిక చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. దీనికి 9మంది టెండర్లు దాఖలు చేశారు. శనివారం పెద్దాపురం యార్డుకు లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని అధికారులు చెప్పారు.

యూపీఎస్సీ 'సివిల్ ఇంజనీరింగ్'లో..
రాజమహేంద్రవరం కుర్రోడికి 12వ ర్యాంక్


బోళ్ల ఉష్మేష్ నందన్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ విడుదల చేసిన ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్(ఐఈఎస్) ఫలితాల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆలిండియా స్థాయిలో రాజమహేంద్రవరం యువకుడు బోళ్ల ఉష్మేష్ నందన్ 12వ ర్యాంక్‌ను సాధించాడు. గతేడాది ఫలితాల్లో 71వ ర్యాంక్ సాధించిన నందన్ ఈ ఏడాది 12వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ప్రస్తుతం అతడు పూణెలో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో శిక్షణలో ఉన్నారు. ఈ సందర్భంగా తన ఆనందాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఈ ఏడాది కష్టపడి మెరుగైన ఫలితం సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు.

నేటి నుంచి కొనసాగనున్న రద్దీ

» రత్నగిరిపై సత్రం గదుల కోసం భారీఎత్తున సిఫార్సు లేఖలు

» తలలు పట్టుకుంటున్న సిబ్బంది

అన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం నుంచి మంగళవారం వరకు రద్దీ అధికంగా ఉండనుంది. ఆదివారం సెలవుదినం కావడం, కార్తీక సోమవారం, మంగళవారం ఏకాదశి కావడంతో భక్తులు భారీసంఖ్యలో తరలిరానున్నారు. నాలుగురోజులపాటు 30వేల వ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తూ దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించాలని ఇప్పటికే సర్క్యులర్ జారీ చేశారు. మరోపక్క దేవస్థానం అధికారులకు సత్రం గదుల కేటాయింపు కోసం అధికసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడంతో గదుల కేటాయింపు కోసం ప్రొటోకాల్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కార్తీక మాసం ముగియడానికి ఇంకా వారంరోజుల సమయమున్నా మంగళవారంతో చాలావరకు కార్తీకమాస హడావిడి అయిపోతుంది.

వీఆర్‌కు రామచంద్రపురం సీఐ


సామాజిక వనసమారాధనలో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

» యూనిఫారంతో సామాజిక కార్తీక వనసమారాధనలో ప్రసంగం

» వివాదాస్పద ప్రసంగంతో చర్యలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు22: రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్‌ను పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపినట్టు విశ్వసనీయ సమాచారం. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహించిన ఒక సామాజికవర్గ వన సమారాధనలో సీఐ అశోక్‌కుమార్ పోలీసు యూనిఫారంతో పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఓ సామాజిక కార్తీకవన సమారాధనలో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోవడంతో రామచంద్రపురం ట్రావెలర్స్ బంగ్లావద్ద పోలీసులతో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్తీక సమారాధన అనంతరం వేదికపై నాయకులు మాట్లాడుతుండగా సీఐ అశోక్‌కుమార్ అక్కడకు వచ్చారు. దీంతో సీఐను ఆహ్వానించారు. ప్రముఖుల ప్రసంగాల అనంతరం సీఐను వేదికపైకి పిలిచి మాట్లాలని కోరడంతో సీఐ అశోక్‌కుమార్ ప్రసంగించారు. పోలీసు యూనిఫారం వేసుకున్నాక కులమతాలు ఉండవని చెబుతూనే తన ప్రసంగం మొదలుపెట్టారు. కృష్ణా జిల్లాలో ఎక్కువ కాలం పనిచేసిన తనకు మంత్రి సుభాష్ తనకు రామచంద్రపురంలో మన అనే తత్వంతో సీఐ పనిచేసే అవకాశం కల్పించారని, అందుకు మంత్రి సుభాష్‌కు, నేను నా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తదుపరి తమ సామాజికవర్గం గురించి మాట్లాడుతూ భవిష్యత్తులో గోదావరి జిల్లాలో మనదే పైచేయి అవుతుందన్నారు. దీంతో పోలీసు అధికారి హోదాలో ఉండి సామాజికవర్గం గురించి మాట్లాడడం వివాదాస్పదమైంది. సామాజిక మాధ్యమాల్లో కూడా వైరల్ కావడంతో పోలీసులు ఉన్నతాధికారులు చర్యలకు దిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా పోలీసు యూనిఫారంలో ఉండి సామాజికవన సమారాధనలో పాల్గొని పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో సీఐ అశోక్‌కుమార్‌ను వీఆర్‌కు పంపినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సీఐ అశోక్‌కుమార్ తీరుపై రామచంద్రపురం మండలం తాళ్లపొలం సర్పంచ్ కట్టా గోవిందు శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్‌కు ఫిర్యాదుచేశారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయం సందర్శనకు వచ్చిన కె.హర్షవర్ధన్‌కు ఆయన ఫిర్యాదు అందజేశారు. సీఐ కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గోవిందు ఫిర్యాదుచేశారు.

వివాదాస్పదంగా సీఐ వైఖరి

సీఐగా బాధ్యతలు తీసుకున్నాక సీఐ అశోక్‌కుమార్ వైఖరి తరచూ విమర్శలకు తావిచ్చేవిధంగా మారింది. రామచంద్రపురంలోని ఒక సామాజికవర్గం సంఘం ఎన్నికల వ్యవహారంలో ఒకవర్గం వైపు సీఐ మద్దతుగా నిలిచారని మరో వర్గం గుర్రుగా ఉంది. ఆ సామాజిక సంఘం సమావేశాల సందర్భంగా సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు కూడా వెళ్లాయి.

'యూపీఎస్సీ'లో మెరిసిన బొమ్మూరు యువతి

» మోసుగంటి ప్రగతికి 65వ ర్యాంకు

» టెలీకమ్యూనికేషన్‌లో సేవలందించాలనే కోరిక: ప్రగతి

» తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే

రాజమహేంద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిధిలోని బొమ్మూరు బాలాజీపేటకు చెందిన 23 ఏళ్ల మోసుగంటి ప్రగతి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024లో విజేతగా నిలిచారు. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికం ఇంజనీరింగ్ విభాగంలో ఆమె 65వ ర్యాంకు సాధించారు. త్వరలో ఉద్యోగంలో చేరనున్నారు. ప్రగతి తల్లిదండ్రులు మోసుగంటి వెంకటేశ్వరరావు, అనిత ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. వారి ఇద్దరు పిల్లల్లో పెద్ద అమ్మాయి ప్రణతి ఎంబీబీఎస్ చదవగా, చిన్నమ్మాయి ప్రగతి బొమ్మూరులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 10వ తరగతి వరకూ చదివారు. తిరుమల కాలేజీలో ఇంటర్‌చదివారు. పుదుచ్చేరిలో నిట్‌లో బీటెక్ పూర్తిచేశారు. కేవలం ఆన్‌లైన్స్ కోచింగ్ రెండో ప్రయత్నంలోనే ఆమె యూపీఎస్సీకి సెలక్టయ్యారు. మొదట ప్రయత్నంలో 1 మార్కు తేడాతో విఫలమైన ఆమె, సాధించే పట్టుదల పెంచుకుని, రెండో ప్రయత్నంలో సాధించారు. ప్రగతి విజయం సాధించడం పట్ల ఆమెతో పాటు కుటుంబమంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీరి సొంత వూరు అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం. 20 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం వచ్చారు.

● టెలీకమ్యూనికేషన్‌లో సేవలందించాలని ఉంది: ప్రగతి

టెలికమ్యూనికేషన్‌లో సేవలించాలని ఉందని యూపీఎస్సీ విజేత మోసుగంటి ప్రగతి అన్నారు. శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తాను రెండేళ్ల పాటు కష్టబడినందుకు ఫలితం దక్కిందన్నారు. ప్రభుత్వం ఏ ఉద్యోగం ఇచ్చినా పనిచేయడానికి సిద్ధమేనన్నారు. టెలీకమ్యూనికేషన్‌తోపాటు డిఫెన్స్, ఇతర శాఖల్లో కూడా అవకాశం ఉందని చెప్పారు. తాను కష్టపడి చదవడం వెనుక అమ్మ అనిత ప్రోత్సాహం, కృషి ఎక్కువ ఉందన్నారు. తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు.


ప్రగతికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

జ్ఞానం అనేది భవిష్యత్ కరెన్సీ వంటిది

» జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

» ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్ డిస్కవరీపై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానం అనేది భవిష్యత్ కరెన్సీ వంటిదని భారత దేశం భవిష్యత్తులో విద్యా కేంద్రంగా అవతరించనుందని జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. కాకినాడ వర్సిటీలోని ఐఎస్టీలో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్, విజయవాడలోని లైలా న్యూట్రాస్యూటికల్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో శుక్రవారం ఇన్నోవేషన్ ఇన్‌డ్రగ్ డిస్కవరీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగాను, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, లైలా న్యూట్రాస్యూటికల్ కంపెనీ ఆర్ అండ్‌డీ జీఎం డాక్టర్ ఏవీ కృష్ణంరాజు, ఫార్ములేషన్ డీజీఎం డాక్టర్ కిషోర్‌బాబు, ప్రత్యేకాధికారిణి కె.పద్మప్రియ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఫార్మసీ కోర్సుల విభాగాధిపతి బి.భవానీ కన్వీనర్‌గా వ్యవహరించారు. మొదటిగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించగా వీసీ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు 63వ జాతీయ ఫార్మసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ ఆఫ్‌ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు మెమెంటోలను అందజేశారు. ఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీకృష్ణ, రీసోర్స్ పర్సన్‌లు కృష్ణచైతన్య, శ్రీనాథ్, గాయత్రి, అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ మురళీకృష్ణ, అతిథులు



ప్రత్యేక వేదికపై అరటిదొప్పల నడుమ కొలువుదీరిన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు

సత్యదేవ నామస్మరణతో..

మార్మోగిన రత్నగిరి



రత్నగిరిపై పడిపూజలో పాల్గొన్న సత్యదీక్షాపరులు, అయ్యప్ప మాలధారులు

- ఘనంగా పడిపూజ కార్యక్రమం
- అధికసంఖ్యలో హాజరైన సత్యదీక్షాపరులు, అయ్యప్ప మాలధారులు, శివస్వాములు

అన్నవరం, నవంబరు 22: అన్నవరం సత్యదేవుడి ఆలయం శుక్రవారం రాత్రి జై సత్యదేవ నామస్మరణతో మార్మోగింది. సాయంత్రం 6గంటలకు స్వామి వార్షిక కల్యాణ వేదికపై అరటిదొప్పలతో సర్వాంగ సుందరంగా ఐదు ఆలయాలుగా అలంకరించి మధ్యలో సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారిని మరో దానిలో క్షేత్రపాలకులు సీతారాములు, శంకరుడు చిత్రపటాలను ఉంచగా గణపతిపూజతో కార్యక్రమం మొదలైంది. ఛైర్మన్ ఐవీ రోహిత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. స్వామికి అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో సత్యదీక్షాపరులు, అయ్యప్ప మాలధారులు, శివస్వాములు హాజరయ్యారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల తర్వాత తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు సత్యదీక్షల విరమణ

27రోజులపాటు అత్యంత నియమనిష్టలతో ఆచరించిన సత్యస్వాములు నేడు దీక్షలను విరమించనున్నారు. ఆశ్వయుజ మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో ప్రారంభమయ్యే ఈ దీక్షలు కార్తీకమాసంలో వచ్చే మఖ నక్షత్రంతో ముగుస్తాయి. అవకాశం లేనివారు 18 రోజులు, 9రోజులు ఆచరించారు. శనివారం మఖనక్షత్రం సందర్భంగా దీక్షలను దీక్షాపరులు విరమింపచేస్తారు. దీనికోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండదిగువన తొలిపావంచా వద్దనున్న కనకదుర్గ ఆలయంవద్ద అర్చకస్వాములు ఇరుముడులను కడతారు. వీటిని ఆలయానికి చేరుకుని సమర్పిస్తారు. సత్యదీక్షలను 3వేలమంది వరకు స్వీకరించడంతో వార్షిక కల్యాణవేదిక పక్కనున్న ప్రత్యేక హోమగుండంలో కొబ్బరికాయలు, ద్రవ్యాలను సమర్పిస్తారు.

నేడు ఉచిత సామూహిక వ్రతాలు

సత్యదీక్షలు విరమించిన దీక్షాపరులకు శనివారం ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేశారు. వీటికోసం రెండు వ్రతమండపాలను సిద్ధం చేశారు. ఇరుముడితో దీక్ష విరమించిన భక్తులు సత్యదేవుడి దర్శనానంతరం కుటుంబసభ్యులతో సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోవచ్చు. శుక్రవారం 300మంది సత్యదీక్షాపరులు ఉచిత సామూహిక వ్రతాలు ఆచరించారు.

వాళ్లకు 'మళ్లీ పెళ్లి'!!

- ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల గుర్తింపుతో అందని ప్రభుత్వ సేవలు
- చింతూరులోని అల్లిగూడెం వలస ఆదివాసీలకు సామూహిక వివాహాలు



వలస ఆదివాసీలకు సామూహిక వివాహాలు చేస్తున్న దృశ్యం

చింతూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏంటి పెళ్లయిన వాళ్లకు మళ్లీ పెళ్లి అంటున్నారు.. అనుకుంటున్నారా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని అల్లిగూడెం వలస ఆదివాసీగ్రామం. వీరంతా ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 40ఏళ్ల క్రితం ఇక్కడకు వలస వచ్చారు. ఈ క్రమంలో ఇక్కడ జన్మించిన 14మంది యువకులకు ఇటీవల ఆదివాసీ సంప్రదాయ పద్ధతిన వివాహం జరిగింది. వీరందరూ కూడా ఛత్తీస్‌ఘడ్, ఒడిశాలకు చెందిన యువతులనే వివాహం చేసుకున్నారు. ఈ యువకులకు మన రాష్ట్రానికి చెందిన ఆధార్‌తోపాటు ఇతర గుర్తింపుకార్డులు ఉన్నాయి. కానీ, ఆ యువతులకు మాత్రం వారి రాష్ట్రాలకు చెందిన గుర్తింపు కార్డులే ఉన్నాయి. దీంతో వారికి మన రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ సదుపాయాలు పొందే పరిస్థితి లేదు. నూతన జంటలకు సంబంధించి 14మంది మహిళల్లో చాలామంది గర్భం దాల్చారు. ఈ క్రమంలో వారు ప్రసవ సమయంలో ఆరోగ్యశ్రీ సేవలతోపాటు ఇతర పథకాలకు చెందిన లబ్ధి పొందే పరిస్థితి లేదు. ఇవి పొందాలంటే స్థానికత కావాలి. ఇది కావాలంటే వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలి. వీరి ఇబ్బందులు గమనించిన స్థానిక తులసిపాకల ప్రాథమిక వైద్యశాల పరిధిలోని సిబ్బంది ఆ జంటలకు శుక్రవారం సామూహికంగా వివాహం జరిపించారు. ఈ మేరకు వారందరికీ వివాహ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే ఏర్పాట్లను వైద్యశాఖ సిబ్బంది బాధ్యతగా తీసుకున్నారు. వివాహ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఆ మహిళలు కూడా మన రాష్ట్ర పథకాలు అందిపుచ్చుకునే అవకాశం కలగనుంది. వివాహ కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది సీహెచ్ ముక్తేశ్వరరావు, హెచ్‌ఈవో పి.సరోజిని, కె.గంగరాజు, ఎంపీహెచ్‌ఎస్ వి.చిన్నలక్ష్మి, ఆశావర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

'మేం ఢిల్లీ పోలీసులం'

- కాకినాడ జిల్లా కరప మండలం విజయరాయుడుపాలెం సర్పంచ్ ఇంటికి ఫైల్స్‌తో వెళ్లిన ఇద్దరు అపరిచితులు
- అనుమానంతో నిలదీసే సరికి పలాయనం.. పోలీసులకు సమాచారమిచ్చిన సర్పంచ్

కరప, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పోలీసులమంటూ ఇద్దరు అపరిచితులు శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా కరప మండలం విజయరాయుడుపాలెం గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లి నానా హడావిడి చేశారు. ఢిల్లీ నుంచి వచ్చామని హిందీలో గానీ, ఇంగ్లీష్‌లో గానీ మాట్లాడాలని సూచించగా సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ నిరాకరించారు. ఆ రెండు భాషలు తనకు తెలియవని, తెలుగులో మాట్లాడాలని.. దేనికోసం వచ్చారంటూ.. సర్పంచ్ వారిని ప్రశ్నించారు. దీంతో వారు తమ చేతిలో ఉన్న ఫైల్స్‌ను తిరగేసి ఏవేవో అడిగే సరికి అనుమానం వచ్చిన సర్పంచ్ కరప పోలీసులకు సమాచారం అందించారు. చుట్టుపక్కలవారు ఒక్కొక్కరుగా ఆ ఇంటికి చేరుకోవడం, కరప పోలీసులకు సర్పంచ్ ఫోన్ చేయడంతో భయపడిన ఆ ఇద్దరు అపరిచితులు బైక్ ఎక్కి అక్కడినుంచి పలాయనం చిత్తగించారు. ఇంటికి వచ్చిన వారిద్దరూ చూడడానికి ఉత్తరాది ప్రాంతానికి చెందినవారిగానే ఉన్నారని, వారి హెయిర్ క్రాప్, స్టైల్ పోలీసులు అని భ్రమించేలాగ ఉన్నాయని సర్పంచ్ రాఘవ తెలిపారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం చూసి ఉండడంతో వారిని చూడగానే తనకు అనుమానం వచ్చిందన్నారు. సాధారణంగా ఇతర రాష్ట్రాల పోలీసులు ఏదైనా కేసు పనిమీద మరో ప్రాంతానికి వస్తే ముందుగా అక్కడి పోలీసులకు సమాచారం అందిస్తారని, స్థానిక పోలీసుల సహకారం తీసుకుని సంబంధిత వ్యక్తులను విచారిస్తారని కరప పోలీసులు చెప్పినట్టు సర్పంచ్ తెలిపారు. అపరిచిత వ్యక్తులపట్ల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కరప ఎస్‌ఐ సునీత సూచించారు.

మంత్రి లోకేశ్ చొరవతో..
నేడు స్వగ్రామానికి కువైట్ బాధిత మహిళ

గండేపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన గారా కుమారి కువైట్‌లో తాను ఎదుర్కొంటున్న బాధలను చెప్పుకుంటూ తనను తిరిగి స్వదేశానికి చేర్చాలని కోరుతూ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించి అధికారులతో మాట్లాడి ఆమెను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. బతుకుతెరువుకోసం కువైట్ వెళ్లి అక్కడ నానా ఇబ్బందులు పడుతూ విడుదల చేసిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయింది. శనివారం ఆమె తిరిగి స్వగ్రామానికి చేరుకోనున్నట్లు తెలియడంతో తల్లిదండ్రులు కనిపే సీత, అప్పారావు, పిల్లలు నాగమణి, సుబ్బలక్ష్మి, ఆనంద్ శామ్యూల్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ తల్లిని తిరిగి ఇండియాకు రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి నారా లోకేశ్ తీసుకున్న చొరవపై వారు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై వెంటనే స్పందించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి యల్లమిల్లి సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి, సుబ్బారావు అభినందనలు తెలిపారు.

తీరప్రాంత మత్స్యకారులకు నష్టపరిహారం
చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోస్తా తీర ప్రాంతంలో చమురు కంపెనీల కార్యకలాపాలు, శబ్ద కాలుష్యం వల్ల మత్స్య సంపద తగ్గిపోతుండడంతో వేలాది మంది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారని, జిల్లాలో వాటి ప్రభావం చూపే గ్రామాల మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో సీఎంను రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, అయితాబత్తుల ఆనందరావు, బొమ్మిడి నాగేశ్వరరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల సుబ్బరాజు, పంతం నానాజీ కలిసి వినతిపత్రం సమర్పించారు. రిలయన్స్, జీఎస్‌పీసీ, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌతమీ గోదావరి మొగ, చిర్రయానంవద్ద గ్యాస్ అన్వేషణ, డ్రిల్లింగ్, ఆయిల్ వెలికితీత సమయంలో మొగ ప్రభావిత మత్స్యకారు గ్రామాలకే నష్టపరిహారం చెల్లించారన్నారు. జిల్లాలో ఇంకా ప్రభావం చూపే మిగిలిన గ్రామాలకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ముమ్మిడివరం, రామచంద్రపురం, అమలాపురం, పి.గన్నవరం, మండపేట, కొత్తపేట, కాకినాడ అర్బన్ కాకినాడ గ్రామీణం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొన్ని ప్రభావిత గ్రామాల మత్స్యకారులకు నష్ట పరిహారం ఇవ్వకపోడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు నష్టపరిహారం అందేలా చేయాలని, భవిష్యత్తులో చమురు సంస్థలు కార్యకలాపాల సమయంలో ఆయా గ్రామాల మత్స్యకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ఎంవోయు చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కో ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ, జనసేన కాకినాడ జిల్లా నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

యానాంకు ఐదెకరాలు కేటాయించాలి

- సీఎంను కోరిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని ప్రజల అవసరాల దృష్ట్యా జిల్లాకు చెందిన ఐదెకరాల భూమిని కేటాయించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబును కలిశారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో భేటీ అనంతరం యానాం,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన అంతర్ రాష్ట్ర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మల్లాడి మీడియాతో మాట్లాడారు. యానాం ప్రజావసరాల నిమిత్తం జిల్లాలో ఐదెకరాల భూమిని కేటాయించాలని, కాకినాడలోని మల్లాడి సత్యలింగ నాయకర్ చార్టీస్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఎవ్వరివద్ద ఎంత ఉన్నాయనేది విచారణ నిర్వహించి నివేదిక కోరాలని, ఎంతో పురాతనమైన అంతర్వేది ఆలయానికి సంబంధించి ఆలయ వారసులను ధర్మకర్తలుగా నియమించాలని కోరామన్నారు. మత్స్యకారులకు షరతులు లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరామన్నారు. బీసీ సంఘాల గౌరవ అధ్యక్ష హోదాలో వినతిపత్రం ఇచ్చామన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకున్న వ్యక్తి అరెస్టు

బిక్కవోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో అభివృద్ధి పనులను అడ్డుకున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పశువుల ఆస్పత్రి నుంచి ప్రభుత్వాస్పత్రి వరకూ ఉపాధి హామీ పథకంలో రూ.4.12లక్షలతో పంచాయతీ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ పనులను పి.రాధాకృష్ణ అనే వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అధికారులు, శానిటేషన్ సిబ్బందిని దూషించాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి టి.రోజా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. అతడ్ని కోర్టుకు తరలించగా 14రోజులపాటు రిమాండ్ విధించారని ఎస్‌ఐ రవిచంద్ర శుక్రవారం తెలిపారు.

నేడు, రేపు బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 23, 24 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన బాస్కెట్‌బాల్ జట్లు పాల్గొంటాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల కార్యవర్గం

కాకినాడ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షురాలిగా రత్నబాయి, కార్యదర్శిగా సలాదిరాజు కోశాధికారిగా కె.కిషోర్, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భోజన విరామ సమయంలో కాకినాడలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కమిటీని ఏర్పాటుచేస్తూ ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా కమిటీ ఎన్నికకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర అసోసియేట్‌అధ్యక్షుడు జీకే వర్మ, సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫీఖర్ ఆధ్వర్యం వహించారు.

అమలాపురం ఎక్సైజ్ డిపో ఈఎస్‌వో ఆకస్మిక మృతి

అమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎక్సైజ్ డిపోలో పనిచేస్తున్న ఈఎస్‌వో పి.మహాత్మారాజ్(60) ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన జనిపల్లి రోడ్డులో నివాసం ఉంటున్నారు. శుక్రవావరం ఉదయం బయట తలుపులు వేసుకుని ఇంట్లోనే ఒంటరిగా ఉన్నారు. ఎంతకూ ఆయన బయటకు రాకపోవడం, ఫోన్ మోగుతూ ఉండడంతో స్థానికులు అమలా పురం పట్టణ పోలీసులకు సమచారం అందించారు. ఆయన గుండెపోటుతో మరణించి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. మృతుని భార్య రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. దీంతో మహాత్మారాజ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు రాజమహేంద్రవరం తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని వాడ్రేవుపల్లిలో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు.వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలానికి చెందిన 20ఏళ్లయువతి 16రోజులక్రితం వాడ్రేవుపల్లిలో బంధువుల ఇంటికి వచ్చింది. ఈనెల 20న రాత్రి 10గంటలకు భోజనం చేసి నిద్రపోగా అర్ధరాత్రి దాటిన తర్వాత బంధువులకు ఆమెమంచంపై కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా బంధువుల ఇళ్లవద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బంధువు బూలా దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భర్త నుంచి వేరుపడి కొంతకాలంగా పుట్టింట్లో ఉంటున్న తమ కుమార్తె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి శుక్రవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండల సీహెచ్ గున్నేపల్లి గ్రామానికి చెందిన గాలిదేవర అనంతలక్ష్మి-త్రిమూర్తులు దంపతుల కుమార్తె కటికరెడ్డి మహలక్ష్మి(అమ్మాజీ)(36) భర్తతో విడిపోయి కొంతకాలంగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో గురువారం తమతో చిన్నపాటి గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి ఫిర్యాదులో పేర్కొంది. రోజూ మహలక్ష్మి ఆమె కుమార్తె శ్రీజను బస్సు ఎక్కించడానికి రోడ్డుపైకి వెళ్తుందని, గురువారం కూడా వెళ్లి ఉంటుందని భావించామని, ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కుమార్తె మహలక్ష్మి ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదని, చుట్టుపక్కల బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధవళేశ్వరంలో మత మార్పిడి కలకలం

- స్నానఘాట్ వద్ద వివాదం

ధవళేశ్వరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పుణ్యకార్తీకమాసం.. సాయంత్రం అయ్యప్పస్వాములు, శివస్వాములు గోదావరి స్నానం ఆచరించే సమయం.. ప్రతిపౌర్ణమికి నిలువెత్తు గోదావరి మాతకు హారతి ఇచ్చే ఘాట్‌లో బాప్తిజం ఇవ్వడంపై వివాదం నెలకొంది. శుక్రవారం సాయంత్రం ఒక పాస్టర్ కొందరు మహిళలతో వచ్చి స్నానఘాట్‌లో బాప్తిజం ఇవ్వడంపై అక్కడున్న కొందరు స్వాములు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవులో అన్యమత కార్యక్రమాలు నిర్వహించవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో పాస్టర్ కూడా వచ్చిన మహిళలు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో తాము స్నానాలు చేస్తుంటే ఫొటోలు, వీడియోలు తీస్తారా అంటూ స్వాములతో వాగ్వాదానికి దిగారు. రేవులో మత మార్పిడి చేస్తున్నారన్న సమాచారంతో స్థానికులతోపాటు ఆలయాలకు వచ్చే భక్తులు, స్వాములు రేవు వద్దకు వచ్చారు. విషయం తెలుసుకుని పోలీసులు రావడంతో పాస్టర్‌తోపాటు క్రైస్తవులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో వివాదం సద్దుమణిగింది. తదుపరి హిందూ సంఘ నాయకులు అక్కడకు వచ్చారు.హిందూ దేవాలయాల సముదాయం ఉన్న ఘాట్‌లో మత మార్పిడులకు దిగడంపై మండిపడ్డారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధి గాంచిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి, అమ్మవార్లదర్శనం కోసం భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లను వరికంకుల ధాన్యంతో ప్రత్యేకంగా అలంకరించారు. సౌభాగ్య స్త్రీల ఆధ్వర్యంలో లలితా, సహస్ర నామకుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు చేరుకూరి వీరబాబు, దత్తు సోదరులు సేవా సభ్యులు మాట్లాడుతూ ప్రజలందరూ ధాన్యానికి లోటులేకుండా ఉండాలని, వ్యవసాయం బాగుండాలనే ఈ పూజ నిర్వహించామన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడిపై కత్తితో దాడి

- కాజులూరు మండలం గొల్లపాలెంలో ఘటన



దాడిలో గాయపడిన మడికి అప్పారావు

కరప, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో శుక్రవారం ఒక వృద్ధుడిపై మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. గొల్లపాలెం పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొల్లపాలెం శివారు గుండారం కాలనీకి చెందిన మడికి అప్పారావు స్థానిక మార్కెట్‌సెంటర్‌లో ఒక పలావు సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పలివెల వెంకటేష్ అనే వ్యక్తి మద్యం సేవించి వచ్చి అప్పారావుతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో పలావుసెంటర్‌లోని కూరగాయలు తరిగే కత్తితో అప్పారావుపై దాడిచేసి చేతిపైన, గెడ్డంపైన గాయపర్చాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన అప్పారావును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

మంజూరైన పోస్టుల భర్తీలో అవినీతి

- జీజీహెచ్ పరిపాలనా విభాగ మేనేజర్‌పై మరో ఆరోపణ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 2008, 2016, 2018 సంవత్సరాల మధ్య చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియ మిగుల పోస్టుల భర్తీ కేంద్రంగా అవినీతికి దారితీసింది. వివరాలోకి వెళ్తే జీవో నెంబర్లు 62, 63, 140 అనుసరించి గత ప్రభుత్వం హయాంలో పాత రిక్రూట్‌మెంట్లకు సంబంధించి మిగులు పోస్టులు భర్తీ చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందుకు అనుగుణంగా ఆస్పత్రిఅధికారులు మిగులు పోస్టులను భర్తీ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఈ నేపథ్యంలో 2021, 2022 మధ్య మిగుల పోస్టుల భర్తీ ప్రక్రియ జీవోను అనుసరించి చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే వివాదాల మధ్య నలుగుతున్న జీజీహెచ్ పరిపాలనా విభాగ మేనేజర్ నరసింగరావు కొవిడ్ సమయంలో మిగుల పోస్టులభర్తీలో అక్రమాలకు తెర తీయడంపై ఇప్పటికే విచారణజరుగుతోంది. అప్పట్లో పోస్టుల ఖాళీలకు సమాంతరంగా కొత్త ఉద్యోగాలను సృష్టించి మిగుల పోస్టులను భర్తీ చేయకుండా సృష్టించిన కొత్త పోస్టులకు నియామకం చేపట్టాడు. పాత నియామకాలు అని చెప్పి ట్రెజరీని కూడా మభ్యపెట్టి లేని పోస్టులను సృష్టించి జీతాలు అందేలా పావులు కదిపాడు. ఇందుకు ఒక్కో వ్యక్తినుంచి రూ.5లక్షల మేర వసూలు చేశాడని ప్రాథమికవిచారణలో తేలింది. డీఎంఈ ఆదేశాల మేరకు పరిశీలన చేపట్టగా ఈ విషయం బట్టబయలైంది. దీంతో ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు కలెక్టర్‌కు నివేదించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

'పాదగయ'లో అర్జున్ అవార్డు గ్రహీత పూజలు



వెన్నం జ్యోతి సురేఖను సత్కరిస్తున్న ఆలయ ఈవో

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని అర్జున్ అవార్డు గ్రహీత, ఆర్చరీ(విలువిద్య) ప్రపంచ చాంపియన్ వెన్నం జ్యోతి సురేఖ సందర్శించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా సామర్లకోటలోని శిక్షణ కేంద్రంలో సర్వేలో శిక్షణ పొందేందుకు వచ్చిన శుక్రవారం ఆమె పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు అందించారు. జ్యోతి సురేఖను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

'పాదగయ'లో ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు



ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేస్తున్న ఈవో

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని శుక్రవారం రాత్రి మైనార్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు క్షేత్ర విశిష్టతను ఆయను వివరించగా తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను దర్శించుకున్నారు. ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదదతలతో సత్కరించి, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



సఖినేటిపల్లిలో ర్యాలీగా వెళుతున్న సీపీఐ నాయకులు

కదంతొక్కిన కౌలు రైతులు

దేవస్థానం భూముల్లో ఇళ్లను తొలగించవద్దు

కౌలు రైతులకు శిస్తులు పెంచకుండా చూడాలని ధర్నా

అంతర్వేది, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో సీపీఐ నాయకులు శుక్రవారం కౌలు రైతులు, సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. దేవస్థానం భూముల్లో కౌలు రైతులు కట్టుకున్న ఇళ్లను తొలగించవద్దని శాశ్వత భూ యాజమాన్య హక్కు ఇవ్వాలని, కౌలు రైతులకు శిస్తులు పెంచకుండా చూడాలని ధర్నా చేశారు. సీపీఎఫ్ఎల్‌సీ, జాయింట్ ఫార్మింగ్ సొసైటీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, సొసైటీలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చే అన్ని పథకాలను ఈ సొసైటీలకు వర్తింపచేస్తూ రైతుభరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గొంది నుంచి సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.రామకృష్ణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం నాయకుడు డేగ ప్రభాకర్, కె.సత్తిబాబు, కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, నల్లి బుజ్జిబాబు ర్యాలీలో పాల్గొని సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ నిర్వహించారు.

సహపంక్తి భోజనాలు

ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపవరంలో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేశారు. రైతులతో పాటు వివిధ కులాల, పార్టీల నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. వృక్ష పూజల్లో స్థానికులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ఇసుక తవ్వకాలు

ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ఇసుక తవ్వకాల్లో స్థానికుల నుంచి అభ్యంతరాలు

పట్టించుకోని ఉన్నతాధికారులు






తాటికాయలవారిపాలెంలో స్థానికులు అడ్డుకున్న ఇసుకట్రాక్టర్, లంకలగన్నవరంలో ఇసుక తీస్తున్న దృశ్యం

పి.గన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో ఇసుక తవ్వకాలు ఎలా జరుపుతారు, ర్యాంపు ఏ అధికారి మంజూరు చేశారని ప్రశ్నిస్తూ స్థానిక గ్రామస్తులు పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం వంతెనపై నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. గోదావరినది తీరం జిల్లెడులంక సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని వారు ఆరోపించారు. పి.గన్నవరం పరిధిలోని చింతపల్లివారిపేట, కత్తులవారిపేట, కొక్కిరివారిపేట, ఉడుగులవారిపాలెం తదితర గ్రామాలకు అదే శ్మశానవాటిక అని దానిలో ఇసుక తవ్వకాలు ఎలా జరుపుతారని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ ఆ ప్రదేశంలో ఇసుక ర్యాంపులేదని ఏవిధమైన తవ్వకాలు అక్కడ జరగలేదన్నారు. అనుమతులు అడిగితే చూపడంలేదని ప్రభుత్వం నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా ఇసుక తవ్వ కాలు ఎలా జరుపుతారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గంటిపె దపూడిలో స్థానిక గోదావరి నదీతీరంలో జరుగు తున్న ఇసుక తవ్వకాలపై పలువురు స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఎస్ఐ బి.శివకృష్ణ, రెవెన్యూ సిబ్బంది చేరుకుని ఇరువురినీ పంపించివేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు నుంచి ఏవిధమైన విధి విధానాలు రాకపోవడంతో స్థానికంగా లంక గ్రామాల్లో స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిరసన కార్యక్రమంలో గొల్లపల్లి నర్సింహమూర్తి, చిన్నం వెంకట్రావు, సిహెచ్ నందుబాబు, పల్లి సత్యనారాయణ, కాట్రు మన్యం, నాగార్జున, పల్లి సత్యనారాయణ, మోసుగంటి రామకృష్ణ, వెంకట్రావు ఉన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు

గోదావరి నదీతీర ప్రాంతాలలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. కనీస అనుమతులు లేకుండా ఎవరికి వారే ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. లంకలగన్నవరం, మానేపల్లి, గంటిపెదపూడి, పి.గన్నవరంలలో బోట్స్‌మేన్ సాయం తోను, ఇసుక మేటలను తవ్వుకుపోతున్నారు. అలాగే అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో సైతం ఇసుక తవ్వకాలు జోరుగానే సాగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.



ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

కుండలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరిమాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో అక్కల గంగాదేవి, రంకిరెడ్డి వీరభద్రరావుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 2500మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, మోటిపల్లి చిన్న, అక్కల నాగమందేశ్వరరావు, గంగుమళ్ళ కిరణ్, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, బాలచంద్రరావు పాల్గొన్నారు.

రేపు శృంగేరి పీఠాధిపతి రాక

అమలాపురం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం గుడిమెళ్లంకలో ఈనెల 24, 25 తేదీల్లో జగద్గురు శృంగేరి పీఠాధిపతి విధుశేఖరమహాస్వామి విజయయాత్ర జరుగుతుందని స్వామి మంగళంపల్లి సాయిరామ్ తెలిపారు. గుడిమెళ్లంకలో శ్రీఉమాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో స్వామిజీ పాల్గొంటారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా బస్సు సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, మంగళంపల్లి కార్తీక్‌శర్మ, గొవ్వాల నాగరాజు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణోత్సవాలకు

వివిధ పనులకు టెండర్ల స్వీకరణ



కల్యాణోత్సవాలకు టెండర్లు స్వీకరిస్తున్న అధికారులు

అంతర్వేది, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు టెండర్లు పిలిచారు. వివిధ పనుల నిమిత్తం పదమూడు రకాలకు సంబంధించి టెండరు, బహిరంగ వేలాలను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. తలనీలాలు, తాటాకుల సప్లయి, క్యూలైన్, సీసీ కెమెరాలు, శానిటేషన్, కొబ్బరిచెక్కలు పోగు చేసుకునే హక్కుల టెండర్లు ఖరారు చేయగా లడ్డూ, ప్రసాదం, విద్యుత్ అలంకరణ, షామియానా, వంట పాత్రల సప్లయి, సర్వేబాదులు, ఫొటోలు, వీడియో తీయడానికి సంబంధించి సరైన ధరలు రానందున వాటి తాలూకా టెండర్లు వాయిదా వేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భైరా నాగరాజు, కార్యనిర్వహణాధికారి బొక్కా వీరవెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 23న విధాన్ సే సమాధాన్ పేరిట జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలే మహిళలకు ఆయుధాలన్నారు. పని ప్రదేశాల్లో సమస్యలు ఎదురైతే మహిళలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. న్యాయపరంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న సదస్సుకు అధిక సంఖ్యలో మహిళలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్ చెల్లింపుపై అవగాహన కల్పించాలి

అల్లవరం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): పింఛన్ బకాయితో మూడు నెలల చెల్లింపుపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. డిసెంబరు 1నుంచి పింఛన్ తీసుకోకపోయిన మూడు నెలల బకాయి సొమ్ము ఒకేసారి ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే, ఎన్‌పీసీఐ లింకింగ్, శానిటేషన్, తాగునీరు అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఏవో లక్ష్మణరావు, రమణమ్మ, సుబ్బలక్ష్మి, కార్యదర్శులు ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీనివాస్, సాయిబాబు, కనకమ్మ, సౌమ్య పాల్గొన్నారు.

సంజయ్‌మూర్తి నియామకంపై హర్షం

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి తనయుడు కె.సంజయ్‌మూర్తి బాధ్యతలు చేపట్టడంపై రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పొన్నాడ సూర్యారావు మాట్లాడుతూ సంజయ్‌మూర్తి ఎంపిక కోనసీమకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, కార్యదర్శి జి.స్టాలిన్, వీవీ నాగేశ్వరరావు, చింతా ప్రసాద్, గుబ్బల రజిత, జాలెం భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ అవగాహన సదస్సు

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి అధ్యక్షతన బాలికా సంరక్షణ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమానికి రాజోలు పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గిరి, రైటర్ అప్పలరాజు హాజరై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు కేవీఎస్ గనికమ్మ, ఎన్.జ్యోతి, సీహెచ్ వరలక్ష్మి, అధ్యాపకులు పి.నరసింహరాజు, ఎం.అంబేడ్కర్, బీఎస్ నరసింహారావు, ఎన్.శాంతిశ్రీ, ఎన్ఎస్ఎస్‌పీవో రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు అమలాపురంలో ఉమ్మడి జిల్లా హేతువాద సభ

అమలాపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ వార్షిక మహాసభ ఈ నెల 24వ తేదీ ఆదివారం అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, డి.రాజశేఖర్ తెలిపారు. వార్షిక మహాసభలో హేతువాత, మానవవాద అధ్యయన తరగతులు, గ్రంథావిష్కరణలు నిర్వహిస్తామన్నారు. మత విశ్వాసాలు-సైన్స్, సనాతన ధర్మం-మానవధర్మమా, భౌతిక, వాస్తవికవాదం-మానవవాదం, విశ్వపరిణామం-జీవపరిణామం తదితర అంశాలపై హేతువాత సంఘ రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారు. సమావేశానికి భారత హేతువాద సంఘ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న, సంఘ ఛైర్మన్ మేడూరి సత్యనారాయణతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ

కాట్రేనికోన, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరక గ్రామంలో ఉన్న శ్రీవిజయలక్ష్మీదుర్గా అమ్మవారికి వనచర్ల వెంకటరెడ్డి కుమార్తె సత్యవాణి కుమారుడు స్వామినాథ్ కుటుంబ సభ్యులు రూ.1.14లక్షల విలువైన వెండి కిరీటం, వెండి నేత్రాలు సమర్పించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు ఆకొండి శ్రీకాంత్, గ్రామ ముఖ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

• 109 ఎగ్జిబిట్స్ ప్రదర్శన • పరిశీలించిన న్యాయనిర్ణేతలు • నేటితో ముగింపు





వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

యానాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరుగుతున్న ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంటుంది. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో వివిధ విభాగాలలో ఈ 109 ప్రదర్శనలను నిర్వహించారు. వీటిలో ముఖ్యంగా పర్యావరణానికి హానిలేని ప్లాస్టిక్ వస్తువులు తయారీ, స్మార్ట్‌ఫోన్ ఎడిక్షన్, సేవ్ ఎర్త్, వేట్స్‌వాటర్ ప్యూరిఫికేషన్, రాకెట్ ల్యాండ్‌రోవర్, ఆటోమేటిక్ ఫ్లైషింగ్ టాయ్‌లెట్, తదితర ప్రదర్శనలు అందరినీ ఆలోచింప చేస్తున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలు తిలకిస్తున్నారు. న్యాయనిర్ణేతలు పరిశీలించి విద్యార్థులను వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరిలో ప్రతిభకనబరిచిన ప్రదర్శనలు వివిధ విభాగాలలో ఎంపికచేసి అత్యుత్తమ ప్రదర్శనలు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. శనివారంతో ముగియనున్నాయి.

'రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాలి'



రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న తాతబాబు తదితరులు

అమలాపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే 27వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన వారిని శుక్రవారం అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయిదుర్గ అభినందించారు. పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా జెర్సీలు డాక్టర్ వైనరసింహారావు, తోట రాము, కూచిమంచి కృష్ణ, కొమ్ముల సురేష్ అందజేశారు. జిల్లా జట్టుకు కోచ్‌గా యాండ్ర గౌతమ్, టీమ్ మేనేజర్‌గా జీవీ బాబు వ్యవహరిస్తారు. మునగాల మన్యం, సైదుల రమణ, బూల చిరంజీవి పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పన్నులను సకాలంలో వసూలు చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతమైన సేవలు అందించాలని నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌వారు వీడియో కాన్ఫరెన్సులో సూచించిన అంశాలపై నగర పంచాయతీలోని అన్నిశాఖల అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. ఇంటి, కుళాయి పన్నులు, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నులు, ఆక్రమణలు, డీ అండ్ ట్రేడ్స్ పన్నులను సకాలంలో వసూలుచేసి నగర పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేయాలన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలకు మొదటి ప్రాధాన్యంను ఇచ్చి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయా పనుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో సమయాభావంతో పనిచేసి నగర పంచాయతీని అగ్రగామిగా ఉంచాలన్నారు. ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ పీవీ సుధాకర్, మేనేజర్ పీవీ నూకరాజు, ఆర్ఐ భాస్కరరావు, జేఏవో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, సునీత, రామకృష్ణప్రసాద్, రమణ, లక్ష్మీనారాయణ, ఎం.భాస్కరరావు, సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదును వేగవంతం చేయాలి

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సభ్యత్వాలు నమోదును వేగవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం దొమ్మేటి రమణకుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో అశోక్ పాల్గొని మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రతీ వార్డులోను 300 కుపైగా పార్టీ సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చెల్లి అశోక్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, నడింపల్లి శ్రీనివాసరాజు, విళ్ల వీరాస్వామినాయుడు, రెడ్డి శ్రీను, బొక్కా రుక్మిణి, కాశి రామచంద్రరావు, బడుగు సందీప్‌సాయి, సరిపెల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అమలాపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు బండారులంకలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగి ఎందరో స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం తీసుకోవడం శుభపరిణామమని మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు, మాడా మాధవి, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, కాశిన బాబి, యాళ్ల కుమార్, కొండా శ్రీనివాసరావు, మాడా పద్మదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శివకోటిలో ..

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శివకోటి పెద్దకమ్మపాలెంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు శుక్రవారం హాజరయ్యారు. సభ్యత్వ నమోదుపై క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, కసుకుర్తి త్రినాథస్వామి, కడలి ఏడుకొండలు, యల్లమిల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 7న తల్లిదండ్రుల సమావేశం

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో డిసెంబరు 7న తల్లిదండ్రుల సమావేశాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. ఈనెల 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డిసెంబరు 7వ తేదీకి వాయిదా పడిందన్నారు. సమావేశానికి ముఖ్యమంత్రి స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎస్ఎంసీ ఛైర్మన్‌ల వరకు అందరూ పాల్గొంటారన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను విద్యార్థుల తల్లిదండ్రులకు నాలుగు రోజుల ముందుగానే పంపించాలని డీఈవో సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులంతా సహకరించాలని ఆయన సూచించారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం



ప్రమాణస్వీకార మహోత్సవానికి ర్యాలీగా వెళ్తున్న కూటమినేతలు

అంబాజీపేట, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధర్(పెదబాబు) అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆయన విజయవాడలో ప్రమాణస్వీకార మహోత్సవానికి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నామన రాంబాబు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు గణపతి వీరరాఘవులు, చిన్నంబాలవిజయరావు, మైపాల తాతాజీ, అరిగెల బలరామమూర్తి పాల్గొన్నారు. తొలుత మాజీ జడ్పీటీసీ అరిగెల బలరామమూర్తి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు చన్యుత ఎంపిక



వడ్డేల చన్యుత

అమలాపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భీమవరంలో జరిగిన జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని వడ్డేల చన్యుత అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు చమ్యత ఎంపికైనట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్ మురళీకృష్ణ తెలిపారు. జేఎన్‌టీయూకే తరపున చన్యుత ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు కర్ణాటకలోని బెల్గాంలో జరిగే ఆలిండియా పోటీల్లోపాల్గొంటుందని చెప్పారు. చన్యుతను కళాశాల ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, కళాశాల ఏవో జక్కం వెంకటకృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో ఉన్న శ్రీఉమాసత్యలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాథశర్మ ఆధ్వర్యంలో వినాయకుడికి అభిషేకం, సత్యలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం, ఉమాదేవికి వైభవంగా లక్ష కుంకుమార్చన పూజను వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా అప్పనపల్లిలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పార్వతీమల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం జరిగిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పార్వతీదేవిని పూజించారు. ఆలయ ప్రధాన అర్చకుని సారథ్యంలో పలువురు వేద పండితులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది.

కళారంగాన్ని ప్రోత్సహించాలి

అంబాజీపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అంతరించుకుపోతున్న కళారంగాన్ని ప్రోత్సహించేందుకు కృషిచేయాలని రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొడక్షన్ ఫోర్స్ ఎస్పీ కె.నరసింహరావు అన్నారు. గంగలకుర్రులో అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను కళాపీఠం కన్వీనర్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కవులు, రచయితలు, కళాకారుల విశిష్టతను ప్రస్తుత తరానికి తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నిర్వహించిన కవితా పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. పర్యావరణ పరిరక్షణ వచన కవితా పోటీలలో రాజమహేంద్రవరానికి చెందిన అంజనాయాత్రికి కవితా పురస్కారం, షేక్ ఖాదర్ వలీకి కళాపురస్కారం, ఇంటిలిజెన్స్ ఎస్ఐ జి.రామకృష్ణకు కవితా ప్రోత్సాహక పురస్కారం, యల్లమిల్లి నాగసుధకొండకు సేవారంగ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఫిల్మ్ ఇండస్ట్రీ రచయిత డైరెక్టర్ పడాల శివసుబ్రహ్మణ్యం, టి.గనిరెడ్డి, ఉదయభాస్కర్, కొల్లూరి దివాకర్, దీపక్ రాజ్, పుల్లేపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలనేఇ వారు వినతిపత్రాన్ని శుక్రవారం జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబుకు వివరించారు. 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, జీవో నంబరు 7 అమలు చేయాలని, వేతనాలు సక్రమంగా చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జడ్పీటీసీకి అందించారు. కార్యక్రమంలో ఎం.జగ్జీవన్‌రామ్, డీఈవో అనంతలక్ష్మి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు ఇందిరానగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. నేదునూరి ప్రసాద్‌కు చెందిన తాటాకిల్లు దగ్ధమై రూ.2లక్షలు ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.10వేల నగదు, ఫర్నీచర్, ఇంటి సామాగ్రి, గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపకాధికారి కేవీఎస్ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మిపతి, వీఆర్వో కృష్ణమూర్తి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ సాయాన్ని అందించే విధంగా కృషిచేస్తామని సర్పంచ్ బాలరాజు బాధితులకు హామీ ఇచ్చారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోచు ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారికి పలు సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,10,758 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన నల్లా కోటేశ్వరరావు, సూర్యావతి దంపతులు రూ.50,116 విరాళం ఇచ్చారు. వారికి ఉప కమిషనరు స్వామివారి చిత్రపటం అందించారు.

భీమేశ్వర ఆలయంలో
ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు పూజలు

ద్రాక్షారామ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాన్ని శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ సందర్శించారు. ఆయన భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను సందర్శించి పూజలు చేశారు. దర్శనం అనంతరం బేడా మండపంలో పలువురు పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆయన వెంట రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల ఉన్నారు.



స్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న హర్షవర్ధన్

భక్తి శ్రద్ధలతో లక్షపత్రి పూజ



కపిలేశ్వరపురంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో ఉన్న అగస్త్యేశ్వర, పాప వినాశేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజను భక్తి శ్రద్ధలతో జరిపారు. పండితుడు వై.కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, లక్షపత్రి పూజలను శాస్త్రోక్తంగా చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని పలు శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువజామునే మహిళలు పుణ్యస్నానాలుచేసి శివాలయాల్లో పూజలు, కార్తీక దీపాలంకరణ చేశారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో రుద్రాభిషేకం చేసి అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఘనంగా వారాహి అమ్మవారి లక్ష రుద్రాక్ష పూజలు

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బోడిపాలెం వంతెన వద్దనున్న విజయదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో వారాహి అమ్మవారి లక్ష రుద్రాక్ష పూజ, సహస్రనామ పూజలు, వెలువలి వెంకటశివరామ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. అమ్మవారిని వీధుల్లో ఊరేగించి బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా నిర్వహించారు. 23 శనివారం రోజున అమ్మవారికి సామూహిక లక్ష పుష్పార్చన, లక్షగాజుల అర్చన, చండీ హోమం తదితర పూజలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని వారు కోరారు.



ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

గుమ్మిలేరులో ఆకట్టుకున్న కార్తీక దీపారాధన

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరు ఉరదాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్తీక దీపారాధన ఆకట్టుకుంది. కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అముజూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా భక్త మండలి సభ్యులు ఆలయం వద్ద శుక్రవారం రాత్రి ముగ్గులు వేసి కార్తీక దీపాలను వెలిగించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు తరలివచ్చారు.



గుమ్మిలేరు ఉరదాలమ్మ ఆలయం వద్ద కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

అభ్యాసన సామర్థ్యం పెంపు కోసం నాస్ సర్వే

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం తెలుసుకునేందు కు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం డివిజన్ ఉపవిద్యాధికారి శ్రీపాద ఫణినరసింహ కోరారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థు లతో నాస్ సర్వేకు సంబంధించిన శిక్షణలో ఆయ న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాస్ సర్వేలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 108 పాఠశా లల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు వచ్చేనెల 4 నుంచి పరీక్ష నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయి మాస్టర్స్ ట్రైనర్స్ సురేష్, జాన్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు, సమగ్రశిక్ష ఏఎంవో, పిల్లి రాంబాబు, రామచంద్రపురం డివిజన్ పరిధిలో మండల విద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపవిద్యాధికారి నరసింహఫణి

ఇలా..తుప్పట్టిపోవాల్సిందేనా..?

• డ్రైవర్ లేక కదలని స్వచ్ఛ సర్వేక్షన్ వ్యాన్ • పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం



తాపేశ్వరంలో డ్రైవర్‌లేక మూలకు చేరిన స్వచ్ఛ సర్వేక్షన్ వాహనం

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్ ద్వారా పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగు కోసం అందించిన స్వచ్ఛ సర్వేక్షన్ వాహనాలు చాలాచోట్ల పాడైతుప్పపడుతూ మూలకు చేరుతున్నాయి. మండపేట మండలం తాపేశ్వరం పంచాయతీకి చెందిన స్వచ్ఛ సర్వేక్షన్ వాహనానికి డ్రైవర్ లేక పోవటంతో మూలకుచేరి తుప్పుపడు తోంది. దీంతో ఆ వాహనాన్ని తాపేశ్వరం పం చాయతీ ఎదురుగా రోడ్డు పక్కన వృథాగా పడి ఉంది. ఈ వాహనాన్ని నడిపేందుకు డ్రైవర్ లేక పోవడంతో దీనిచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి అంతకంతకూ తుప్పుపడుతూ శిథిల స్థితికి చేరుకుంటోంది. ఇప్పటికైనా ఈ వాహనాన్ని వాడుకలోకి తీసుకురావాల్సిందిగా పంచాయతీ సిబ్బందికి స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల నియామకంపై హర్షాతిరేకాలు

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమించడంపై కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీరెడ్డి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మండపేట రూరల్ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, కపిలేశ్వరపురం, రాయవరం మండల టీడీపీ అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, కొప్పిశెట్టి మాధవరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ జయబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రాయవరం: రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే వేగుళ్ల నియామకంపై శుక్రవారం మండలంలోని పలువురు టీడీపీ నాయకులు సంబరాలు జరిపారు. రాయవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేకు పదవి లభించడంపై టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్‌కే పరమహంస, టీడీపీ మండలాధ్యక్షుడు కె.మాధవరావు, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి తదితరు లతో పాటు మండలంలోని 12 గ్రామాల టీడీపీ నాయకులు, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

కపిలేశ్వరపురం: రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే వేగుళ్ళను నియమించడంపై రాష్ట్ర తెలుగు యువత సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. కపిలేశ్వరపురంలో ఆయన మాట్లాడుతూ వేగుళ్ల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ళ ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.



రాయవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



జడ్పీటీసీ అబ్బుకు వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బంది

104 సిబ్బందిని ఆదుకోవాలి

కపిలేశ్వరపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 104 సిబ్బందిని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం కపిలేశ్వరపురం జడ్పీటీసీ పుట్టపూడి అబ్బుకు వినతిపత్రం ఇచ్చారు. నిడసమెట్లలో 104 సిబ్బంది కె.సాయిప్రసాద్ (డీఈవో), కె.లోవరాజు(డ్రైవర్) లు జడ్పీటీసీకి వినతిపత్రం అందించినట్టు తెలిపారు. గతంలో మాదిరిగా పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని తదితర పలు డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నట్టు తెలిపారు.



విరాళం ఇస్తున్న రామచంద్రరావు

నిత్యాన్న దానానికి విరాళం

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్న దానానికి రూ.1,10,106 విరాళం అందజేశారు. కొత్తపేటకు చెందిన దొంతికుర్తి రామచంద్రమూర్తి, ఆదిలక్ష్మీ దంపతుల పేరున జనవరి 14న అన్నదానం జరపాలని సూపరింటెండెంట్ బి.వీరభద్రరావుకు చెక్ అందించగా వారిని ఆయన సత్కరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన చిట్టిబాబు

చంద్రబాబును కలిసిన చిట్టిబాబు

కె.గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం అమరావతిలో బీజేపీ సీనియర్ నాయకుడు కర్రి చిట్టిబాబు కలిశారు. మత్స్యకార సమస్యలు పరిష్కరించాలని, కేంద్రం నుంచి మత్స్యకారుల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు నేరుగా వారి కుటుంబాలకు చెందేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశామని ఆయన తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌పై ఏఈవోలకు మూడురోజుల శిక్షణను జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు ప్రారంభించారు. రావులపాలెంలో కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ శిక్షణకు 12 మంది జూనియర్ అసిస్టెంట్లు(ఏఈవో)లకు శిక్షణ ఇస్తామన్నారు. తాడేపల్లిగూడెం రీజనల్ కోడింగ్ సెంటర్ ఉపసంచాలకులు శ్రీనివాస్ పాల్గొని విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై తెలిపారు.

బెల్ట్‌షాపులు నడిపితే కఠిన చర్యలు

కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కాత్యాయని



కాత్యాయని

కొత్తపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న 25 మద్యం షాపులకు సంబంధించి బెల్ట్‌షాపులకు అనుమతుల్లేవని సీఐ కె.కాత్యాయని తెలిపారు. శుక్రవారం కొత్తపేటలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే మద్యానికి సంబంధించి షాపుల వద్ద ఎమ్మార్పీ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు మాత్రమే అమ్మకాలు జరపాల న్నారు. ఇప్పటి వరకు 27 బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. నాటుసారా కేసులు 17 నమోదు చేసి 8 మందిని అరెస్టు చేశామన్నారు. నాటుసారా స్థావరాలపై దాడులు జరిపి 7,700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. పాట దక్కించుకున్న వారే మద్యం వ్యాపారం చేసుకోవాలని దీన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినట్టు తెలిస్తే 94409 02423కి సమాచారం ఇవ్వాలని సీఐ కాత్యాయని తెలిపారు.

జిల్లాలో 4.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి



సోమేశ్వరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

రాయవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 4.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. శుక్రవారం సోమేశ్వరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నెలాఖరు నాటికి లక్ష ఎకరాల్లో వరికోతలు పూర్తవుతాయని మండపేట, ఆలమూరు, కె.గంగవరం, రాయవరం, రామచంద్రపురం, రావులపాలెం మండలాల్లో 45 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్టు చెప్పారు. బంగాళాఖాతంలో వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు త్వరితగతిన వరికోతలు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తొలుత రైతుల వద్దకు వెళ్లి ఆయన మాట్లాడారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంట ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్, వ్యవసాయ సహాయకుడు హరిబాబు, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు ఉన్నారు.

ద్రాక్షారామలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కృషి

ఎంపీ హరీష్ మాధుర్




ఎంపీ హరీష్‌మాధుర్‌ను సత్కరిస్తున్న మాలసంఘ నాయకులు

ద్రాక్షారామ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. శుక్రవారం ద్రాక్షారామ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మాలల వనసమారాధన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ద్రాక్షారామలో అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి సుభాష్ సహకారంతో అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాల నాయకులు ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పండు గోవిందు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్ తదితరులతో పాటు దళిత సంక్షేమ సేవా సంఘం గుబ్బల శ్రీను, జనసేన నాయకుడు బుంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమితోనే మాదిగలకు మేలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమితోనే మాదిగలకు మేలు చేకూరుతుందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు మందపల్లి దొరబాబు, వల్లూరి రాజా అన్నారు. శుక్రవారం ఎల్‌సీఎం కాంపౌండ్‌లో నియోజకవర్గ ఎన్డీయే కూటమి పార్టీల మాదిగల సమావేశం జరిపారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమీషన్ నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ జాతికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఆకుమర్తి చిన్న మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మాదిగలను మోసగించిందన్నారు. భవిష్యత్తులో మాదిగలు ఎన్డీయే కూటమితోనే ఉంటామన్నారు. సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మోర్త దొరబాబు, పట్టణ ఎస్సీ సెల్ నాయకుడు దొమ్మలపాటి రాజశేఖర్, జొన్నకూటి భాస్కరరావు, దిగుమర్తి వీరబాబు, పలివెల ఇజ్రాయేల్, ఇందుర్తి బుజ్జి, సలగల భాస్కరరావు, లంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లను సత్కరిస్తున్న నాయకులు

దంగేరు శివాలయంలో లక్షపత్రి పూజ

కె.గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు శివాలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ జరిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాల అనంతరం వేదపండితులు లక్షపత్రి పూజ చేశారు. అధికసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



మక్కా మసీదులో మొక్కు తీర్చుకున్న మడికి గ్రామానికి చెందిన జన సైనికుడు షేక్ సుల్తాన్

మక్కా వెళ్లి మొక్కు తీర్చుకున్న జన సైనికుడు

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచకపాలన పోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషి ఫలించాలని ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడు గ్రామానికి చెందిన షేక్ సుల్తాన్ మొక్కుకున్న నేపథ్యంలో ఇటీవల మక్కాకు వెళ్లి మొక్కు చెల్లించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావాలని, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌కు పదవి రావాలని మొక్కుకున్నట్టు ఆయన తెలిపారు. దీంతో మక్కాకు వెళ్లి శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్టు చెప్పారు. ఆయన్ను పలువురు జన సైనికులు అభినందించారు.

వరకట్న వేధింపులపై కేసు

ఆత్రేయపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలి గ్రామానికి చెందిన మోర్త దీవెన కుమారికి ఏడాది క్రితం ముక్కామల గ్రామానికి చెందిన మోర్త నరేంద్రతో వివాహమైంది. పెళ్ళి సమయంలో రూ.3లక్షలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం నుంచి అదనపు కట్నంతో పాటు అత్తమామల వేధింపులు అధికం కావడంతో పుట్టింటికి చేరుకుంది. భర్త, అత్తమామలు, కుటుంబ సభ్యులపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఆత్రేయపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో శుక్రవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి
వ్యక్తి అరెస్టు

రాయవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామంలో బెల్ట్‌షాపుపై దాడిచేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు రామచంద్రపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 నిబ్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చామన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే 94405 11271, 94908 73965 ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, హెచ్‌సీ డేవిడ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు
ప్రశంసలు

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరంలో వున్న శ్రీచైతన్య విద్యార్థులు ఈ ఏడాది కూడా నాసా స్పేస్ రీసెర్చ్ సెంటర్‌కు ప్రాజెక్టు చేసి పంపిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. తమ పాఠశాల 37 మంది విద్యార్థులు సంబంధించి నాసా కిట్స్‌ను తాపేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మిన వెంకట సురేంద్ర చౌదరి నుంచి శుక్రవారం అందించారు. విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోడానికి అడుగులు వేయాలని రీజనల్ ఇన్‌చార్జి నరేష్ కోరారు. చదువుతోపాటు ప్రయోగాల్లో కూడా రాణించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. పాఠశాల ప్రాంగణంలో నాసాకి ఎంపికైన విద్యార్థుల అభినందన సభ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్ పాండే, డీన్ రాఘవరెడ్డి సిబ్యాచ్ ఇన్‌చార్జి మల్లికార్జున్‌తోపాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై
అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సచివాలయ మహిళా పోలీసులకు ఎంపీడీవో ఎ.రాజు, ఎస్‌ఐ ఎం.అశోక్ సూచించారు. ఆలమూరులో గ్రామ మహిళా పోలీసులతో విడివిడిగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశాలలో వారు మాట్లాడారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరించే వారిని గుర్తించి సమాచారం అందించాలని కోరారు. ఇటీవల ఎంపీడీవోగా రాజు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సచివాలయ మహిళా పోలీసులు ఆయన్ను సత్కరించారు.

పశువులకు మోతాదుకు మించి
మందులు వాడొద్దు

కె.గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పశువులకు మితిమీరి యాంటీ బయోటిక్స్ వాడటం వల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుందని పశుసంవర్ధకశాఖ రామచంద్రపురం ఏడీఏ ఓ.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో యాంటీ మైక్రో బయోటిక్ రెసిస్టెన్సీపై అవగాహన సదస్సు జరిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యులు ఎం.కృష్ణార్జున, బిందు, పి.రామచంద్రరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.